అడ్డుగోడలు

ప్రయాగ గృహలక్ష్మి

'రేపు తొమ్మిది గంటలకి ఎయిర్ పోర్టులో నన్ను కలుసుకో. నేను చెప్పి నట్లుగా రావాలి.

'విక్టర్'

నమ్మలేనట్లుగా యింకోసారి చదువు కుంది కేబుల్‌ను అపర్ణ.

'యిదేమిటి ? నాలుగురోజుల కిందటే గా విక్టర్‌నుంచి లెటర్ వచ్చింది. తను వచ్చేసరికి యింకా నెలరోజులు అవుతుందని వ్రాశాడు అందులో. మరి యింతలో ఈ కేబుల్ ఏమిటి?'

ఆశ్చర్యంగా దాన్ని చేతుల్లో పెట్టుకుని అలాగే కుర్చీలో కూర్చుండి పోయింది అపర్ణ. ఒక్కసారి తనకీ, విక్టర్‌కీ పరిచయం కలిగించిన సంఘటన, చికాగోలో తను గడిపిన రోజులు గుర్తుకు వచ్చాయి.

'ఆ రోజులని ఎప్పటికీ మర్చిపోలేదు తను మద్రాసు యూనివర్సిటీలో రిసెర్చికి చేరిన తనకి అయిదునెలల తరవాత ప్రయత్నం చేయగా చికాగో యూనివర్సిటీలో స్కాలర్‌షిప్ వచ్చింది. ఆరు నెలల్లో మెటీరియల్ కలెక్టు చేసుకుని మళ్లా యిండియా తిరిగి వచ్చేయాలి. నిజంగా తనెంత సంతోషించింది. యింట్లో వెళ్లమని నాన్నగారు ప్రోత్సహించారు కాని, అమ్మను ఒప్పించేసరికి తలప్రాణం తోకకి వచ్చింది తనకి. 'అక్కడ నువ్వు ఎలా మానేజ్ చేస్తావు?' అని ఎవరైనా తనని అడిగితే 'నాకేం భయం ? అయినా అక్కడున్నవాళ్ళు ఏమీ పెద్దపులులు కాదు, వాళ్ళూ మనుషులే' అని సమాధాన మిచ్చేది తను. అంతా సిద్ధంచేసుకుని, చివరికి ప్లేను ఎక్కేసరికి అప్పుడు తెలిసింది తనకి భయమంటే ఏమిటో. కొత్త దేశం, కొత్త మనుష్యులు. తను యింగ్లీషు ఎంత బాగా మాట్లాడగలిగినా, వాళ్లు మాట్లాడేతీరుకీ, తమతీరుకీ చాలా తేడా ఉంటుంది. వాళ్ళు మాట్లాడేదాన్ని తను అర్థం చేసుకోలేకపోతే ఎలాగ? యిలాంటి ఆలోచనలు రాగానే ఒక్కసారి గుండె ఝల్లుమంది తనకి. పరుగెత్తి విమానం లోంచి కిందకిదూకి యింటికి పారిపోవా లనిపించింది. వస్తున్న ఏడుపును అతి కష్టంమీద ఆపు చేసుకుని అలాగే శూన్యం లోకి చూస్తూ ఉండిపోయింది తను.

అక్కడకి వెళ్లింతరువాత తను అనుకున్న విషయాల్లో పెద్ద కష్టపడక పోయినా ముఖ్యంగా ఒక్కవిషయంలో చాలా బాధపడింది తను అదే భోజనం విషయంలో. బ్రెడ్డుముక్కలు, ఉడికించిన బంగాళాదుంపలు, ఉడికించిన బీన్సు యివి తనకి ఏమాత్రం సహించేవి కావు పోనీ వంట వండుకుందామా అంటే తను యూనివర్సిటీకి వెళ్లడం, యిటు వంట వండుకోవటం రెండిటికీ కుదిరేదికాదు. ముఖ్యంగా మన దేశంలో వండుకోవడానికి పనికివచ్చే వస్తువులు ఎక్కడ అమ్ము

తారో తెలిసేదికాదు. ప్రతిదానికి ఎవరో ఒకర్ని అడగాలంటె సిగ్గుగా ఉండేది తనకు. మనం కాఫీ తాగినట్లు అక్కడ స్టూడెంట్సు, షాంపేన్, విస్కీ, జిన్ తాగుతూంటె తనకి విపరీతమైన ఆశ్చర్యం వేసేది. వెళ్లిన వారంరోజులకే తను చాలా వీక్ అయిపోయింది. ఈ స్కాలర్‌షిప్ చక్కగా యింకా కాస్త చిన్న యూనివర్సిటీలో వస్తే బాగుండేది. కొంపమునిగి పోయినట్లు ప్రపంచంలో పెద్ద బిజీ సిటీ అయిన చికాగోలోనే రావాలా అని తిట్టుకునేది.

ఆ రోజు తను ఎప్పటికీ మర్చిపోలేదు. ఎలా మర్చిపోగలుగుతుంది? 'విక్టర్'ని పరిచయం చేసినరోజు అది. వారంరోజులనుంచి సరిఅయిన భోజనంలేక తనకి ముఖ్యంగా ఆరోజు ఏదోలా అనిపించింది. మాటిమాటికీ ప్రపంచం అంతా గుండ్రంగా తిరిగి పోతున్నట్లనిపించేది కళ్లకి. ఎలాగోలాగ సాయంత్రం అయిదు వరకు గడిపింది డిపార్టుమెంటులో. లిఫ్టు దగ్గర కొచ్చేంతవరకు ఎలాగోలాగ కింద పడిపోకుండా కంట్రోలు చేసుకోగలిగింది. లిఫ్టులో యిలా అడుగుపెట్టిన మరుక్షణంలో ఏమైందో తనకు తెలియదు. మెలకువ వచ్చేసరికి తను బెడ్‌మీద ఉన్నట్లనిపించింది. కళ్లువిప్పేసరికి ఎదురుగా తేనెరంగు కళ్లు, ఎర్రటిజుట్టు, తెల్లటి మొహం, పొడవాటి సూదిముక్కుగల మనిషి మొహం తన మొహానికి దగ్గరగా వున్నట్లనిపించింది. 'ఎవరూ' అంటూ గబుక్కున లేవబోయింది. 'లేవకండి, ఫరవాలేదు.' అంటూ ఆ వ్యక్తి మళ్లా తన బుజం పట్టుకుని పడుకోబెట్టాడు. ఒక్కసారి ఏడుపు ఉప్పెనలా వచ్చింది తనకి. రెండుచేతులూ ముఖానికి దగ్గరగా పెట్టుకుని వెక్కి, వెక్కి ఏడవడం మొదలు పెట్టింది తనను చూసి ఆ వ్యక్తి ఒక్కసారి కంగారుపడిపోయి 'డాక్టర్, డాక్టర్ ఆ అమ్మాయికి మెలకువ వచ్చింది.' అంటూ లోపలికి గబగబా పరిగెత్తినంత వేగంగా వెళ్లాడు. అతను అటు వెళ్లగానే మంచంమీద కూర్చుని ఏడుపు ఆపుకోవడానికి విశ్వప్రయత్నంచేసింది తను. వాళ్లు తిరిగి వచ్చేసరికి కళ్లు తుడుచుకుని మామూలుగా ఉంది తను. తనని చూడగానే ఆ డాక్టరు నవ్వుతూ 'నువ్వు యిండియన్‌వి కదూ?' అన్నాడు. అవునన్నట్లుగా తల ఊపింది తను. 'చూడమ్మాయి ఫుడ్ సరిగా తీసుకోపోతే ఎలాగ? నువ్వు' అని ఆగిపోయాడు 'నేను ప్యూర్ వెజిటేరియన్ని' అని చెప్పింది తను. 'అలాగా! అయితే మాత్రం ఏం? ఉడికించిన బంగాళాదుంపలు, బీన్స్ అవి బాగా తినమ్మా. నాలుగురోజుల్లో బలం వచ్చేస్తుంది'అన్నాడతను 'తింటాను, తింటాను. బంగాళాదుంపలు నేను ఈసారి అవి కనిపిస్తే యిక్కడినుంచి యిండియాలో పడేట్లు విసురుతాను' అనుకుంది తను తను బిల్లు చెల్లించబోతే 'అది నాడ్యూటీ' యిక్కడికి మిమ్మల్ని తీసుకొచ్చింది నేను' అన్నాడతను. తను మాట్లాడకుండా ఆశ్చర్యంగా అతనివైపు చూస్తూ ఉండిపోయింది. హాస్పటల్‌నుంచి బయటికి వచ్చేశాక తను అతనికి థాంక్సు చెప్పి తన ఫ్లాట్‌కి పోదామనుకుంది. కానీ బయటికి రాగానే 'ఏదైనా రెస్టారెంటుకి వెళ్లి కాఫీ తీసుకుని వెళ్దాం. లేకపోతే మళ్లా మీరు పడిపోగలరు' అన్నాడతను నవ్వుతూ తన కారుని సమీపిస్తూ. తను మాట్లాడకుండా అతన్ని అనుసరించింది.

హోటల్లో అడుగుపెడుతూ ఉలిక్కిపడింది తను అది ఖరీదైన హోటలు స్టూడెంట్సు సర్వసాధారణంగా యింతంత పెద్దహోటల్సుకు రారు. మరి యితను, అని అనుకుంది తను యిద్దరూ కాఫీతాగి, కేక్సు తిన్నారు. అప్పుడే అతను ఎన్నో ప్రశ్నలు వేశాడు తన్ని. అన్నిటికీ చక్కగా సమాధానమిచ్చింది తను. తిరిగి అతన్ని ప్రశ్నలుకూడా వేసింది. అప్పుడు తెలిసింది తనకి అతనిపేరు 'విక్టర్' అనీ, న్యూక్లియర్ ఫిజిక్స్‌లో, తనున్న యూనివర్సిటీలో రిసెర్చి చేస్తున్నాడని. ఎంతో చనువుగా మాట్లాడిన అతనితో తను కూడా చాలా చనువుగా సరదాగా మాట్లాడింది తను తనని తన ఫ్లాట్‌దగ్గర డ్రాప్ చేస్తూ 'మీరేమీ అనుకోకుండా ఉంటే ఒక్కమాట' అన్నాడతను. ఏమిటీ అన్నట్లు చూసింది తను అతనివైపు. 'నేను యిండియన్సు చాలామందిని రకరకాల చీరలు కట్టుకున్నవాళ్లని చూశాను కానీ యింత చక్కటిచీర ఎవ్వరూ కట్టుకోలేదు' అన్నాడు. ఆశ్చర్యంగా అతనివైపు చూస్తూంటే 'గుడ్‌నైట్' చెప్పి వెళ్లిపోయాడతను. అతను వెళ్లగానే తన చీరవైపు ఒకసారి చూసుకుంది. లేత నీలంరంగుకి, ముదురు నీలంరంగు బార్డరున్న గద్వాలు చీర. 'ఫరవాలేదు ఒమెరికన్ అయినా విక్టర్‌కి మంచి టేస్టు ఉంది చీరల విషయంలో' అనుకుంది తను అప్పుడు

అంతే ఆ రోజునుంచి యిద్దరికి మంచి ఫ్రెండ్‌షిప్ అయిపోయింది. విక్టర్ యిండియా గురించి ఎన్నో ప్రశ్నలు వేసేవాడు. అతని క్యూరియాసిటీ చూస్తే ఒక్కొక్కప్పుడు నవ్వుకూడా వచ్చేది తనకి. అన్నిటికీ ఓపిగ్గా సమాధానమిచ్చేది. ఆ ప్రశ్నల్లో ఎక్కువగా ఆచారాల గురించి ఉండేవి. ఒకరోజు తను యిండియాలో స్టూడెంట్సుగురించి చెప్తూ 'యిదిగో విక్టర్ యిక్కడింత హాయిగా నీతో కూర్చుని మాట్లాడుతున్నాను. యిదే మా దేశంలో అయితే ఈపాటికి నీమీద, నామీద లక్ష స్కాండల్సు పుట్టేవి. చివరికి నేను చదువుకూడా మానేసే పరిస్థితులు కూడా కల్పించబడతాయి. అయితే సిటీస్‌లో యింత ఘోరం లేదు. కానీ ముఖ్యంగా ఈ విషయంలో మా ఆంధ్ర ప్రదేశ్‌లో మరీ కష్టం అంది' తను నవ్వుతూ ఆశ్చర్యంగా అన్నిమాటలు వినేవాడు విక్టర్.

విక్టర్ సహాయంతో మెటీరియలంతా తొందరగానే కలెక్టు చేసుకుంది తను. రోజూ సాయంత్రం అయిదవగానే విక్టర్ తనూ కలిసి ఏదో ఒక రెస్టారెంటులో కూర్చుని కబుర్లు చెప్పుకునేవారు. యింక వీక్ ఎండ్స్‌లో విక్టర్ చుట్టుపట్ల ఉన్న ఊళ్లలో ఏమైనా విశేషాలుంటే తీసి కెళ్లి చూపించేవాడు అప్పుడప్పుడు బీచ్‌కి వెళ్తూ ఉండేవారు. అక్కడ ఆడా, మొగా తేడాలేకుండా అందరూ సన్‌బాత్ తీసుకుంటూంటే తను దూరంగా ముడుచుకుని కూర్చుని చూస్తూ ఉండేది. అప్పుడప్పుడు విక్టర్‌కూడా వాళ్లలో చేరుతూ ఉండేవాడు అయితే ఒక్కసారి కూడా తనని, యిది చెయ్యి, అది చెయ్యి అని బలవంతం పెట్టలేదు చాలామంది యిండియన్సుకి అమెరికన్సులో నీతి నిజా

అడ్డుగోడలు

యూఅ తక్కువ అని నమ్మకం. వాళ్లతో వాళ్లు ఎలా ఉన్నా పైదేశస్థులను చాలా గౌరవిస్తారు. ఆ ఆరునెలల్లో విక్టర్ తనతో ఎంతమర్యాదగా ఉన్నాడు. కనీసం భుజంమీదైన ఒక్కసారి కూడ చెయ్యి వెయ్యలేదు. ఎంతో జాగ్రత్తగా ప్రవర్తించే వాడు. అయితే అప్పుడప్పుడు ఏదైనా కామెంటు చేసేవాడు. అవైనా చాలాసిటీగా ఉండేవి ఒకసారి తను తెల్లదానికి నల్లరంగు జరీబార్డరున్న వెంకటగిరిచీర కట్టుకుంది తనని పదేపదే చూశాడు ఆరోజు. చివరికి 'ఈ చీర నీకు చాలా బాగుంది. బాగా సూటయింది నీకు' అన్నాడు ఉండబట్టలేక యింక తన మనసులోని భావాన్ని అణచిపెట్టుకోలేక ఆ మాటన్నాడు అని గ్రహించడానికి ఎంతోసేపు పట్టేదికాదు తనకి. అసలు అతను కామెంట్ చేసేది తక్కువ అయితే ఆ అతి చిన్న కామెంట్స్‌కే సిగ్గుతో ఎర్రబడేవి తన బుగ్గలు అది చూసి 'మా అమెరికన్స్ ఎవ్వరూ యింత అందంగా సిగ్గుపడలేరు' అనేవాడు.

దాంతో మరి రెండు నిముషాలవరకు తలెత్తి అతని వైపు చూడలేక పోయేది. మళ్లా సర్దుకుని కళ్లెత్తి చూసేసరికి అతను తనవైపే చూస్తూ ఉండేవాడు. ఆ తేనె రంగు కళ్లలో ఏదో ఆప్యాయత కనిపించేది తనకి.

విక్టర్ పరిచయంతో ఆరునెల్లు యిట్టే గడిచిపోయాయి. తను వెళ్లేరోజు వచ్చింది. విక్టర్ మొహంలో ఏదో తెలియని బాధ కన్పించింది తనకి. పదకొండు గంటలకి తను ప్లేను ఎక్కాలంటే ఎనిమిదిగంటలకల్లా వచ్చేశాడు యిద్దరూ ఎంతసేపు మాట్లాడుకున్నారో తెలియదు.

ప్లేను ఎక్కబోయేముందు విక్టర్ తన చెయ్యి పట్టుకుంటూ 'అపూ మీ యిండియాలో చాలా అమూల్యమైన వస్తువులున్నాయని అన్నావుకదూ నేను యిండియా తప్పకుండా వస్తాను ఎందుకో తెలుసా? యిండియాలోని ఒక అమూల్యమైన వస్తువు నాక్కావాలి అందుకని.' అంటూ తన చెయ్యి గట్టిగా పట్టుకుని వదిలేశాడు. మొట్టమొదట తనకు అర్థం కాలేదు. కాని తర్వాత అర్థం అయింది ఒక్కసారి బుగ్గ దగ్గర చెయ్యిపెట్టుకుని 'అయ్యో' అనుకుంది.

ఆ తర్వాత అతనిదగ్గరనుంచి రెగ్యులర్‌గా లెటర్సు రావడం మొదలుపెట్టాయి తను కూడా జవాబులిచ్చేది. అయితే ఉత్తరాల్లో కూడా, ఎప్పుడూ ఏమీ వ్రాసేవాడు కాడు. క్షేమ సమాచారాలు, తనక్కడ కాలం ఎలాగ గడుపుతున్నాడో అన్నీ వివరంగా వ్రాసేవాడు ఒక్కో ఉత్తరంలో 'మీ యిండియాలో తాజ్ మహల్ చాలా బాగుంటుందట అదికాకుండా వెన్నెల్లోచూస్తే చాలా అందంగా ఉంటుందిట మరి నువ్వు నాకు వెన్నెల్లో చూపిస్తావా' అని వ్రాశాడు. తను దానికి తప్పకుండా విక్టర్ అది నా బాధ్యత అని వ్రాసింది. యింకో ఉత్తరంతో అదే నాలుగురోజుల్క్రిందట వచ్చింది. అందులోనే వ్రాశాడు 'నేను నెలరోజుల్లో యిండియా వస్తున్నాను. బాంబేనుంచి మద్రాసు ప్లేన్‌లో వస్తాను. నేను ప్లేను దిగేసరికి ఎయిర్‌పోర్టులో నువ్వు కన్పించాలి. ఎలా కన్పించాలో తెలుసా? నువ్వు ఆరోజు లిఫ్టులో కళ్లు తిరిగి పడిపోయావు. ఆ రోజు నిన్ను ఈ చేతులతో ఎత్తేభాగ్యం కలిగింది. ఆ రోజు కట్టుకున్న చీర కట్టుకో. మర్చిపోవు కదూ' అని వ్రాశాడు. తను నవ్వుకొంది ఆ రోజు.

'నెల రోజులకు రానని వ్రాసినవాడు మరి యింత తొందరగా వస్తున్నాడేమిటి? ఆలోచనలలో తేలిపోతూ అంతవరకూ కళ్లు మూసుకున్న అపర్ణ ఒక్కసారి కళ్లు తెరిచింది గదంతా చీకటిమయం. తడుముకుంటూ వెళ్లి లైటు వేసింది ఆ వెలుగులోనే చేతిలోఉన్న కేబులుని మరొకసారి చూచుకుని డ్రాయర్లోపెట్టి ఒకసారి సూట్‌కేసు దగ్గరికి వెళ్లి చీరల్లో విక్టర్ వ్రాసిన చీరఉందో లేదో చూసుకుని డైనింగు హాలువేపు నడిచింది అపర్ణ.

ఉదయం తొందరగా లేచి ఎనిమిది గంటలకల్లా ఎయిర్‌పోర్టుకి వెళ్లింది అపర్ణ. తొమ్మిది గంటలకి ప్లెయిన్‌లోంచి దిగుతున్న అయిదడుగుల తొమ్మిదంగుళాల



పిడిస్తున్న విక్టర్‌ని చూసేసరికి గుండె ఝల్లుమంది. తడబడుతున్న అడుగులతో ఎదురుగా వెళ్ళింది.

'వచ్చావా! నేను చెప్పినట్లు వస్తావని నాకు తెలుసు' అప్యాయంగా అంటున్న విక్టర్ మొహంలోకి ప్రేమగా చూసింది అపర్ణ.

'అపూ ఈ ఊళ్ళో ఏది పెద్ద హోటలైతే అక్కడికి తీసుకెళ్ళు. యింక డబ్బు సంగతంటావా! అమెరికాలో సుఖంగా జీవించడానికి కావలసినంత డబ్బుంది. అంటే యిండియాకి వస్తే లక్షాధికారిలా ఉండొచ్చు' అన్నాడు విక్టర్. మాట్లాడకుండా అతన్ని 'పెద్ద హోటల్‌కి' తీసుకు వెళ్ళింది. విక్టర్ స్నానం అదీ చేసిం తరువాత అతనికి టిఫిన్ పెట్టించింది అపర్ణ.

యిడ్లీ సాంబారు తింటూ 'కారం కారం' అంటూ వగరుస్తున్న విక్టర్‌ను చూస్తే చాలా జాలేసింది అపర్ణకి

'అపూ యివి ఇంత కారంగా ఉన్నాయేం? మరి నువ్వు చికాగోలో ఒకసారి చేసి పెట్టావు, అవంత కారంగా లేవు' అన్నాడు

'అవా! అవి దొరగారికోసం ప్రత్యేకంగా కారం తగ్గించి చేసినవి మరి ఈహోటలు వాళ్ళకేం తెలుసు విక్టర్ అనే అబ్బాయి చికాగోనుంచి యిక్కడ కొస్తున్నాడని' నవ్వుతూ అంది అపర్ణ.

పదిహేనురోజులు యిష్టమొచ్చినట్లు తిరిగారు రోజూ డిపార్టుమెంటుకి వెళ్ళి సంతకంచేసి మెటీరియల్‌కోసం లైబ్రరికి వెడుతున్నాను అని ప్రొఫెసరుతో చెప్పి విక్టర్‌తో రోజూ ఒకచోటకి వెళ్ళివచ్చేది అపర్ణ. ఒక్కోరోజు విక్టర్‌ని చూస్తే ఆశ్చర్యం వేసేది అపర్ణకి చికాగోలో ఎంత మర్యాదగా ప్రవర్తించాడో యిక్కడ కూడా అంత మర్యాదగా ప్రవర్తిస్తున్నాడు

ఆరోజు ఏడువరకు అటూ యిటూ తిరిగి యిద్దరూ బీచ్‌కి వెళ్ళారు కొంచెం జనం పల్చగా ఉన్నచోట యిద్దరూ కూర్చున్నారు హోరుగాలి కొట్టుతుంటే విక్టర్ మాటలు వింటూన్న అపర్ణ పైట కొంగుతీసి తలమీంచి చెవులమీదుగా కప్పుకుంటూ కూర్చుంది.

'నేను యిండియాకి ఎందుకు వచ్చానో తెలుసా?' అన్న విక్టర్ ప్రశ్నతో చటుక్కున తలెత్తి,

'ఎందుకేమిటి? యిండియా చూడ్డానికి' అంది అపర్ణ.

'కాదు. యిండియాకి చెందిన అమూల్యమైన వస్తువుని నాతో తీసికెళ్ళడానికి' అన్నాడు. ఆశ్చర్యంగా, అర్థం కానట్లు చూసింది అపర్ణ.

'ఇంక దాచడ మెందుకు అపర్ణా నేను యిండియా వచ్చింది నీకోసం. నిన్ను యిక్కడనుంచి చికాగో తీసుకువెళ్ళిపోతాను. నేను యింకా యిక్కడ నెల రోజులుంటాను ఈలోపల నీకు పాస్‌పోర్టు అన్నీ వచ్చేస్తాయి. ఈలోపల మనిద్దరం కలిసి మీ పేరెంట్సుదగ్గరికివెళ్ళి పర్మిషను తీసుకుందాం. నాలుగురోజులు ముందరే బయలుదేరి ఆగ్రావెళ్ళి టాజ్‌ని వెన్నెల్లో చూసి బాంబేవెళ్ళి ప్లేను ఎక్కుదాం. నీ సంగతి అంతా మా పేరెంట్సుతో చెప్పాను. వాళ్ళు ఏమీ అడ్డుపెట్టలేదు పెట్టరు కూడాను నాకు ఒక చెల్లెలుంది యింకెవరూ లేరు. నువ్వేమంటావ్ అపర్ణా' అన్నాడు

అపర్ణకి ఈ మాటలు వింతగా తోచలేదు. ఎప్పుడో ఒకరోజు యిలాంటి మాటలు వినడానికి సిద్ధంగానే ఉంది. కానీ యింత తొందర్లోమాత్రం కాదు.

'ఏమని సమాధానం చెప్తుంది తను? విక్టర్ నువ్వంటే నాకు ప్రాణం. కానీ ఎలాగ? నేను యిండియన్‌ని. అందులో ఆంధ్రప్రదేశ్‌లో పుట్టిన పిల్లని. నీతో రావడానికి, నిన్ను పెళ్ళిచేసుకోవడానికి మావాళ్ళు అంగీకరించరు. దీనికి పరిష్కారం ఏమిటో నాకు తెలియదు కానీ ఒక్కటిమాత్రం నిజం. నేను నీకు ఎలాగో నువ్వు నాకు అంతే' యిలాంటి ఆలోచనలలో తేలిపోతూ విక్టర్ ప్రశ్నకి సమాధానం చెప్పకుండా యిసకలో గీతలు గీస్తూ మౌనంగా కూర్చుండి పోయింది.

'ఆలోచిస్తున్నావా? ఫరవాలేదు. రేపు నీ నిర్ణయం చెప్పు' లేచి నిలబడి పాంటుకి అంటుకున్న యిసక దులుపుకుంటూ అన్నాడు విక్టర్

మాట్లాడకుండా అనుసరించింది విక్టర్‌ని.

నిరసపడిన మోహంతో లోపలికి వస్తున్న అపర్ణని చూసి ఆశ్చర్యపోయింది అపర్ణ రూమ్మేటు కరుణ భోజనం చేయకుండా మంచం మీద వాలి పోయింది.

'ఎలా ఈ సమస్యను పరిష్కరించడం. తను విక్టర్‌తో వెళ్ళిపోతే తన చెల్లెళ్ళకి మళ్ళా పెళ్ళవుతుందా? మరి ఏం చెయ్యాలి. యింక విక్టర్‌ని మరిచి పోవాలి—కానీ అది సాధ్యమా. విక్టర్ పేరు తలచుకుంటేనే మనస్సు పురివిప్పిన నెమలిలా నాట్యం చేస్తుంది. అలాంటి విక్టర్‌ని తను మర్చిపోగలదా. అంతకంటే చచ్చిపోవడం మంచిది. అది సులభం దీనికంటె కానీ అమ్మా, నాన్న, చెల్లెళ్ళు వాళ్ళు ఎంత బాధ పడతారు. వాళ్ళకోసం తను విక్టర్‌ని వదులుకో గలదా? భగవాన్ యిలాంటి సమస్యను నాకు ఎందుకు తెచ్చి పెట్టావు? ఏది ఏమైనా సరే యిలాటి త్యాగాలు తను చెయ్యలేదు. మొదట బాధ పడతారు తర్వాత మర్చిపోతారు అందరూ తనని. అంతే యిదే మంచిది. రేపే వెళ్ళి విక్టర్‌కి చెప్పాలి 'నన్ను ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా తీసుకు వెళ్ళిపో అని చెప్పాలి.' రాత్రంతా కలత నిద్రతో గడిపి తెల్లవారగానే విక్టర్ రూముకి పరుగెత్తింది.

అంతా విని 'నిన్ను యిలా తీసుకు వెళ్తున్నందుకు నాకు చాలా బాధగా ఉంది. కానీ ఏది ఏమైనా నిన్ను మాత్రం వదులుకోలేను.' అపర్ణ చేతులు పట్టుకుంటూ అన్న విక్టర్ మాటలకు కన్నీళ్ళ మధ్య హాయిగా నవ్వింది అపర్ణ.

అనుకున్నట్లుగానే నాలుగు రోజులు ముందరే పాస్‌పోర్టు సంపాదించాడు విక్టర్ ముందర యిద్దరూ కలిసి ఆగ్రా వెళ్ళి టాజ్‌ను చూసి అక్కడనుంచి బొంబేవెళ్ళి ప్లేన్ ఎక్కుదామనుకున్నారు.

'రేపు సాయంత్రం అయిదున్నరకల్లా నీ దగ్గరకు వస్తాను. అక్కడి నుంచి ఏయిర్‌పోర్టుకు వెడదాం', అన్నాడు విక్టర్, మర్నాటి ప్రోగ్రాం గురించి అపర్ణతో చెప్తూ.

'అలాగే' అంది అపర్ణ.

వెళ్ళేరోజు మధ్యాహ్నం 2 గంటలకి తనకు కావలసిన సామాన్లని సర్దుకుంది అపర్ణ. యింతకాలం దాచి ఉంచిన రహస్యాన్ని వెళ్ళేటప్పుడు తన ప్రాణస్నేహితురాలైన కరుణకు చెప్పి వెళ్దామనుకుంది అప్పటికే బట్టలు సర్దుకుంటున్న అపర్ణను చూసి—

'ఎందుకు అపూ ఈ హడావిడి' అంది కరుణ

'నేను వెళ్ళిపోతున్నాను. యిక్కడినుంచే కాదు ఈదేశం విడిచిపెట్టి' అంది అపర్ణ

'ఏమిటీ? నిజంగా? ఎవరితో? ఎప్పుడూ' ఆశ్చర్యంగా ప్రశ్నమీద ప్రశ్న వేస్తూ అంది కరుణ.

'యివాళే విక్టర్ అనే అమెరికన్‌తో చికాగో' అంది అపర్ణ.

'ఏయ్ ఏమిటా సమాధానాలు సరిగ్గా చెప్పు. నా బుఱ్ఱ తిరిగిపోతోంది' అంది కరుణ.

'చెప్పడానికేముంది మామూలుకథే నేను చికాగో వెళ్ళినపుడు విక్టర్ అనే అమెరికన్‌తో పరిచయం అయింది. అతను నాకోసం యిండియా వచ్చాడు యిప్పుడు నన్ను తీసుకు వెళ్తున్నాడు' అంది అపర్ణ మెల్లగా.

'నీకు మతిపోయింది సందేహం లేదు. లేకపోతే వాళ్ళ ఆచారాలేమిటి? మన ఆచారాలేమిటి? అసలు నువ్వు వాళ్ళల్లో యిమడగలవా?' సూటిగా అపర్ణవైపు చూస్తూ అంది కరుణ.

'అలాంటి సందేహాలు ఏమీ అక్కర్లేదు మనం అన్నా మన ఆచారాలన్నా మన కట్టూ, బొట్టూ అన్నా అసలు మన యిండియన్సంటే అతనికి విపరీతమైన యిష్టం యింక దేనికి భయం.' గర్వంగా కరుణవైపు చూస్తూ అంది అపర్ణ.

'చూడు అపర్ణా ప్రస్తుతానికి యివన్నీ అతనికి చాలా ప్రియంగా కన్పించి ఉండొచ్చు కానీ కొన్నిరోజులుపోతే అవే చిరాకు పుట్టించొచ్చు. ముఖ్యంగా కొన్ని విషయాల్లో వాళ్ళకి మనకీ పొత్తు కుదర్దు. వాళ్ళు బాల్‌రూమ్ డాన్సులు చేస్తారు అప్పుడు ఎవరి యిష్టమున్న వాళ్ళతో వాళ్ళు డాన్సు చేస్తారు. అప్పుడు నీ విక్టర్ యాభయి మందితో చేతులు కలిపి డాన్సు చెయ్యడం నువ్వు చూడగలవా? పోనీ చూడగలిగినా తిరిగి నువ్వు అంతమంది మగాళ్ళతో డాన్సు చెయ్యగలవా? పోనీ యిది గుర్తుంచుకో ఏ గుణాలను నీలోచూసి విక్టర్ నిన్ను పెళ్ళిచేసుకుంటానన్నాడో అవే గుణాలు కొంతకాలం పోయింతరవాత అతనికి చిరాకు పుట్టిస్తే అప్పుడు ఏమంటాడో తెలుసా? 'అపర్ణా నీకూ నాకూ సరిపడటం లేదు మనిద్దరం డైవర్సు తీసుకుందాం' అంటే నువ్వు భరించగలవా? భరించగలిగినా మళ్ళా యింకో అమెరికన్ని



పెళ్ళిచేసుకున్నావని పెళ్ళిచేసుకోగలవా? అలా ఎప్పటికీ చెయ్యలేవు. కారణం మనం భారతీయులం. కానీ అతను నిన్ను అతి తేలిగ్గా విడిచిపెట్టి వాళ్ళ అమెరికన్ అమ్మాయిని మళ్ళా పెళ్ళి చేసుకోగలడు. అదే వాళ్ళకీ మనకీ ఉన్నతేడా. అమెరికన్‌ని ప్రేమిస్తే, అతనికున్నంత విశాల దృక్పథం మనంకూడా అలవర్చుకోవాలి. అలాకాకుండా క్షణికావేశంలో తొందరపడితే మిగిలేది దుఃఖం మాత్రమే నా మాట విను నువ్వు తలచుకుంటే విక్టర్‌ని మర్చిపోవడం అంత కష్టమైన పనికాదు' అని యింకా ఏమో చెప్పబోయిన కరుణ వెక్కి వెక్కి ఏడుస్తున్న అపర్ణనుచూసి మాటలు ఆపేసి 'యిప్పుడు మూడయింది. నిర్ణయం నీకే వదిలేస్తున్నాను' అంటూ అపర్ణను ఒంటరిగా వదిలేసి వెళిపోయింది.

అయిదు గంటలకి తిరిగి వచ్చిన కరుణను చూసి—

'కరుణా యిదిగో ఈ ఉత్తరం విక్టర్‌కి యియ్యి. నేను ఎక్కడికి వెళ్ళాను అని అడిగితే నాకు తెలియదు అని చెప్పు' అంది.

ఎర్రగా ఉబ్బిపోయిన అపర్ణ కళ్ళను చూస్తూ ఉత్తరం చదివింది కరుణ.

'విక్టర్,

అడ్డుగోడలు

నేను నీతో రాలేను నన్ను క్షమించు. ఎందువల్ల అని అడుగుతావేమో ఏ భారత సాంప్రదాయం, వారి ఆచారాలు గురించి నువ్వు శ్రద్ధగా విన్నావో అవే మనల్ని దూరం చేస్తున్నాయి యిప్పుడు. ఒక్క మాట నన్ను ఉదాహరణగా తీసుకుని భారతీయులంతా మోసగాళ్ళు అనిమాత్రం అనుకోకు. నాలాంటి వాళ్ళు నూటికి కోటికి ఒకళ్ళుంటారు నన్ను మర్చిపోవడానికి ప్రయత్నం చెయ్యి. యింతకంటె ఏమి వ్రాయగలను? అసలు యింత కంటె ఏం వ్రాయడానికి నాకు అర్హత ఉంది. నవ్వుతూ యిండియా వచ్చిన వాడివి, కొండంత బాధతో తిరిగి వెళ్ళాల్సి వచ్చింది. నేనేం చెయ్యగలను. నన్ను క్షమించు.

అపర్ణ'

'మంచిపని చేశావు' అంటూ అపర్ణ వైపు చూస్తూ బయటికి వెళ్ళింది కరుణ.

గంట తరువాత వచ్చిన కరుణను చూసి 'వెళ్ళిపోయాడా, విక్టర్? అవును వెళ్ళక ఏం చేస్తాడు? అసలు వెళ్ళగొట్టింది నేనేగా' ఏడుస్తూ అంది అపర్ణ.



'అవును వెళ్ళ [illegible]
ఏమన్నాడో తెలుసా?' అంది కరుణ.

'తెలుసుకోవడం అంత కష్టం కాదు. 'బ్లడి యిండియన్ కస్టమ్స్ అనుంటాడు లేకపోతే, మోసగత్తె అనుంటాడు' అంది అపర్ణ.

'అలాగేమీ అనలేదు. నువ్వు పొరపడ్డావు. నువ్వు ఊహించిన దానికంటే ఉన్నతుడు నీ విక్టర్, యిదిగో యిదిచ్చాడు' అంటూ తెల్లని సిల్కు పేపరుని అపర్ణ చేతిలో పెటి బయటికి పరుగెట్టింది కరుణ.

చేతిలో కాగితాన్ని గట్టిగా పట్టుకుని లైటు వేసుకోవాలన్న జ్ఞానం లేకుండా కిటికీ లోంచి గుడ్డి వెలుతురు వస్తూంటే ఒక చేత్తో ఉత్తరం పట్టుకుని అక్కడికి పరుగెట్టి ఉత్తరం చదవడం మొదలు పెట్టింది అపర్ణ.

అపర్ణా,

తప్పు నీది కాదు నాది. అమూల్యమైన వస్తువులను సురక్షితంగా దాస్తారు అని తెలిసి కూడా వాటిని సులువుగా చేజిక్కించుకోపోయాను ఫరవాలేదు. నేను ఓడిపోలేదు. ప్రస్తుతం నేను తిరిగి వెళ్ళాలి. టాజ్‌ని యిప్పుడు చూడను. నువ్వు లేకుండా దాన్ని చూడడం అసంభవం. అమెరికన్సు చాలా పట్టుదల గల వాళ్ళు అన్న విషయం నీకు తెలుసుకదూ! నేను మళ్ళా వస్తాను ఎలా వస్తాను, ఎప్పుడు వస్తాను అన్న విషయం వ్రాయను. ఎప్పుడో ప్పుడు వచ్చి హఠాత్తుగా నిన్ను ఎత్తుకు పోతాను. పోతే బాధ తీసుకుని వెళుతున్నావు అన్నావు కదూ! అది నిజం. కానీ నా పేరు విక్టర్. ఆ విషయం మర్చిపోకు'

నీ

విక్టర్.

కళ్ళవెంబడి నీళ్ళు కారిపోతూంటే కిటికీ ఊచల్ని ఒక చేత్తో గట్టిగా పట్టుకుని 'అమెరికన్సు పట్టుదల గల వాళ్ళు అన్న విషయం నాకు తెలుసు విక్టర్. కానీ మీ కంటే పట్టుదల గలవి మా ఆచారాలు. ఈ అడ్డుగోడల్ని మనం ఛేదించలేము.' అనుకుంది అపర్ణ ఆకాశంలోకి చూస్తూ. ●